ఆకతాయిలకు అడ్డా.. బస్టాండ్



లేపాక్షి ఆర్టీసీ బస్టాండు



బస్టాండు ఆవరణలో మద్యం ప్యాకెట్లు

- బస్టాండ్‌లో కనిపించని బస్సులు
- రహదారే ప్రయాణికుల విడిది

లేపాక్షి: పర్యాటక కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు తాగుబోతులు, ఆకతాయిలకు అడ్డాగా మారింది. అధికారుల పర్యవేక్షణ లేక అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారడం పట్ల ఆ ప్రాంత ప్రజలు ఛీదరించుకుంటున్నారు. హిందూపురం నుంచి కొడికొండ చెక్‌పోస్టుకు ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయి. హిందూపురం, కొడికొండ చెక్ పోస్టు నుంచి వచ్చిపోయే బస్సులు లేపాక్షి బస్టాండులో నిలిపి వెళ్లాల్సి ఉండేది. ఇటీవల ఒక్క ఆర్టీసీ బస్సు కూడా బస్టాండులో నిలపడం లేదు. దీంతో బస్టాండుకు వచ్చే ప్రయాణికులు, పర్యాటకులు కొంతసేపు వేచి ఉన్నప్పటికీ.. బస్సులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతూ ప్రైవేటు బస్టాండుకు వెళుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి దేవాలయానికి వచ్చే భక్తులు, పర్యాకులకు కనీస సమాచారం లేక సతమతమవుతున్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు, మహిళలు బస్టాండుకు నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండులో విధులు నిర్వర్తించడానికి గతంలో హిందూపురం డిపో నుంచి కంట్రోలర్‌ను నియమించారు. కంట్రోలర్ విధుల్లో ఉన్నప్పుడు వచ్చిపోయే బస్సులు బస్టాండులో ఆగి పోయేవి. బస్సులు రాకపోయేసరికి అల్లరిమూకలకు, ప్రైవేటు వాహనాల పార్కింగ్‌కు, పశువుల పాకగా ఉపయోగపడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండు ఆవరణ ప్రస్తుతం మద్యం సీసాలు, తినబదారాలు, మాంసపు వ్యర్థం, చెత్తాచెదారంతో నిండి పోయింది. బస్సులు రాకపోకలు జరిగితే అటు ప్రయాణికులు, ఇటు పర్యాటకులకు ఎంతో ఉపయోగపడుతుంది. అధికారులు స్పందించి బస్సులు బస్టాండుకు వచ్చే విధంగా చర్యలు తీసుకుని, బస్టాండులో ఆర్టీసీ సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

ఆర్టీసీ సిబ్బందిని నియమించండి



లేపాక్షి ఆర్టీసీ బస్టాండులో సిబ్బందిని నియమించాలి. సిబ్బంది బస్టాండులో అందుబాటులో ఉంటే ప్రయాణికులు, పర్యాటకులకు సమాచారం అందించడానికి అవకాశం ఉంటుంది. బస్టాండులోకి బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు, పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఆర్టీసీలో ఉన్న మరుగుదొడ్లను ఉపయోగంలోకి తీసుకు రావాలి.

–మంజునాథ, శిరివరం



అపరిశుభ్రంగా మరుగుదొడ్లు

నిఘా ఉంచుతాం

లేపాక్షి ఆర్టీసీ బస్టాండు ఆవరణలో జరిగే అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచుతాం. మద్యం సేవించడం, క్రికెట్ బెట్టింగ్, ఆకతాయిల అల్లర్లు తదితర సంఘటనలు చోటు చేసుకుంటున్నట్టు మా దృష్టికి వచ్చింది. వీటిపై నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకుంటాం.

–నరేంద్ర, ఎస్ఐ లేపాక్షి

శ్రీనివాసులు మృతి తీరని లోటు

మడకశిరరూరల్: వైఎస్సార్‌సీపీ నేత, సీ కొడిగేపల్లి ఎంపీటీసీ సభ్యురాలు శారదమ్మ భర్త శ్రీనివాసులు మృతి తీరనిలోటని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు నరసింహమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. శ్రీనివాసులు (50) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం తెల్లవారజామున మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఈరలక్కప్ప, నాయకులు గ్రామానికి చేరుకుని శ్రీనివాసులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు. ఎంపీపీ కవిత, సర్పంచ్ కవిత, మండల కన్వీనర్ రామిరెడ్డి, ఎంపీటీసీలు నరసింహమూర్తి, గంగరత్నమ్మ, వివిధ కమిటీల సభ్యులు,నాయకులు నాగేంద్ర యాదవ్, మంజునాథ్, భరత్‌కుమార్, శేషాద్రి, సుధాకర్,శేఖర్, ప్రకాష్, సునీల్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, శశిధర్, రామాంజప్ప ఉన్నారు.



శ్రీనివాసులు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఈరలక్కప్ప, నాయకులు

చిత్రకళలు సృజనాత్మకతకు చిహ్నాలు

పావగడ: చిత్రకళలు సృజనాత్మకతకు చిహ్నాలుగా నిలుస్తాయని స్థానిక బీఈఓ ఇంద్రాణమ్మ తెలిపారు. స్థానిక గురు భవన్‌లో ప్రభుత్వ ఆదర్శ విద్యాలయ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన చిత్ర కళా ప్రదర్శనలో ఆమె మాట్లాడారు. చిత్ర కళ చెట్టుకు వేరు లాంటిదని, అన్ని విషయాలకు చిత్రకళలు ఆధారమన్నారు. చిత్ర కళ నేర్చుకోవడంతో మనసుకు ఆనందం, హాయి కల్గిస్తాయని, సృజనాత్మకత ఆలోచనలు చిగురించడంతోపాటు కళాత్మక భావనలు పెరుగుతాయన్నారు. సైన్స్‌కు సంబంధించిన చిత్రకళలు మరింతగా అలవర్చుకుంటే ఇంజినీరింగ్, మెడికల్ కోర్సులకు ఎంతో ఉపయోగ పడతాయన్నారు. ఆదర్శ విద్యాలయ హెచ్‌ఎం వెంకటేశ్ మాట్లాడుతూ చిత్ర కళల్లో వర్లి, మండల ఆర్ట్స్ నేర్చుకుంటే విద్యార్థుల్లో జ్ఞానం పెరుగుతుందన్నారు. ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు ప్రకాశ్, చిత్రకళా ఉపాధ్యాయుడు రామచంద్రాచార్, దిలీప్, ఈసీఓలు వేణుగోపాలరెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



చిత్రాలను తిలకిస్తున్న విద్యార్థినులు

ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ కమిటీ సభ్యులు

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎస్ఎఫ్ఐ మండల కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఈరేష్ తెలిపారు. మండల శాఖ అధ్యక్షుడిగా హరి, కార్యదర్శిగా అర్జున్ మరో 7 మంది సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం ప్రిన్సిపాల్‌ను కలిశారు. పరస్పర చర్చల అనంతరం నిరుపయోగంగా ఉన్న స్పోర్ట్స్, జిమ్ గదులను తెరిపించారు. భవిష్యత్తులో విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తామని నూతన కమిటీ నాయకులు తెలిపారు.

రైతు విశిష్ట సంఖ్య కోసం నమోదు చేసుకోండి

రొళ్ల: రైతు విశిష్ట సంఖ్య కోసం రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఏఓ రాజ్యలక్ష్మీ పేర్కొన్నారు. గురువారం బీజీహళ్లిలోని పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని చేపట్టారు. ఏఓ మాట్లాడుతూ విశిష్ట సంఖ్యను పొందిన వారికి మాత్రమే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, రాయితీలు, పంటరుణాలు వ్యవసాయ, అనుబంధ పథకాలు వర్తిస్తాయని తెలిపారు. పట్టదారు పాసుపుస్తకం, ఆధార్ జెరాక్స్‌తో పాటు ఆధార్ నంబర్‌కు లింక్ అయిన ఫోన్ నంబర్ తీసుకువచ్చి నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ ప్రసన్నకుమార్, రైతులు పాల్గొన్నారు.

17న వాహనాల వేలం

మడకశిర: నియోజకవర్గంలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 17న మధ్యాహ్నం 2 గంటలకు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ వద్ద బహిరంగ వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ ప్రసాద్ రావు తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు డిపాజిట్ మొత్తం చెల్లించాల్సి ఉంటుందన్నారు. వాహనాలను దక్కించుకున్న వారు వెంటనే డబ్బు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

హనుమాన్‌కు నేడు మహా కుంభాబిషేకం



దండు రోడ్డులోని ఏకశిల ఆంజనేయ విగ్రహం

హిందూపురం అర్బన్: హిందూపురంలోని దండు రోడ్డులో వెలసిన 27 అడుగుల ఏకశిలా హనుమాన్ విగ్రహానికి శుక్రవారం మహా కుంబాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. విగ్రహం ఏర్పాటు చేసి ఏడాది కావడంతో ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్నం 12 గంటలకు కుంభాభిషేకం నిర్వహిస్తామన్నారు. భక్తులు తరలి వచ్చిస్వామి వారి వేడుకల్లో పాల్గొనాలన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి

హిందూపురం అర్బన్: దుకాణాలు, ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని నేరాల నివారణలో పోలీసులకు సహకరించాలని హిందూపురం డీఎస్పీ కె.వి. మహేష్ సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ హిందూపురం పట్టణంతో పాటు లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో దొంగతనాలు జరిగినప్పుడు నేరస్తులు తప్పించుంటున్నారన్నారు. పట్టణంలోని మెయిన్ బజార్‌లో ఉన్న బంగారం, వస్త్ర దుకాణదారులు ఇతర వ్యాపారాలు చేసేవారు, పరిగి రోడ్డు, బెంగళూరు రోడ్డు, రైల్వే రోడ్డు, పెనుకొండ రోడ్‌లో వ్యాపారాలు చేసేవారు తప్పనిసరిగా సీసీ కెమరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతోనే సగం నేరాలు నివారించవచ్చని, ప్రతిఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

ఎక్సైజ్ సీఐగా లక్ష్మీ దుర్గయ్య?

హిందూపురం అర్బన్ : హిందూపురం ఎక్సైజ్ సిఐగా మళ్లీ లక్ష్మీ దుర్గయ్యను నియమించినట్లు సమాచారం. గతంలో హిందూపురం స్టేషన్‌లో పని చేస్తూ పలు ఆరోపణలు రావడంతో ఆయన్ను ఉన్నతాధికారులు విజయవాడలోని కమిషనర్ కార్యాలయంలో కలవాలని సూచించారు. తరువాత గురువారం మళ్లీ హిందూపురం సీఐగానే బాధ్యతలు ఇచ్చినట్లు సమాచారం.

క్లుప్తంగా

గ్రంథాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న రమ

మడకశిర: స్థానిక గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయానికి రోజూ ఎంత మంది పాఠకులు వస్తున్నారో గ్రంథాలయాధికారి శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీ నుంచి గ్రంథాలయానికి రావాల్సిన సెస్‌పై కూడా ఆరాతీశారు. పాఠకుల సమస్యలను తెలుసుకున్నారు.
అగళి: స్థానిక గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి రమ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయ అభివృద్ధికి పలు సూచనలు చేశారు. ఇంచార్జ్ గ్రంథాలయ అధికారి భోజనాయక్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న అనంతశక్తి సొసైటీ సీఈఓ లావణ్య

రొద్దం: ప్రతి మహిళా చట్టాలపై అవగాహన ఉండాలని అనంతశక్తి సొసైటీ సీఈఓ లావణ్య సూచించారు. గురువారం మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లిలో అనంతశక్తి సొసైటీ న్యాయ సలహా మండలి ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. దిశ, గృహ హింస, వేధింపులు, బాల్య వివాహాలు, సమాజంలో మహిళలపై వివక్షపై నాటిక రూపంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అనంతశక్తి సొసైటీ సీఈఓ మాట్లాడుతూ.. సమాజంలో మహిళలను కూడా పురుషులతో సమానంగా చూడాలన్నారు. తల్లిదండ్రులు చిన్ననాటి నుంచి పిల్లలను ఆడ, మగ తేడా లేకుండా సమానంగా పెంచాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ, పాలకవర్గ సిబ్బంది పాల్గొన్నారు.

భోజనశాల ప్రారంభం



దాత విజయలక్ష్మిని సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

అమరాపురం: కె.శివరం జెడ్పీహైస్కూల్‌లో నిర్మించిన భోజనశాలను గురువారం హెచ్‌ఎం .శ్రీనాథ్, దాత విజయలక్ష్మి ప్రారంభించారు. గతేడాది జరిగిన స్వాతంత్ర్య దినోత్సవానికి ఇదే గ్రామానికి చెందిన దివంగత వాసుదేవమూర్తి భార్య విజయలక్ష్మి హాజరయ్యారు. విద్యార్థులు మధ్యాహ్న పూజ భోజనం చేయడానికి పడుతున్న ఇబ్బందులు గుర్తించి భోజనశాల నిర్మాణానికి నిధులిస్తానని హామీ ఇచ్చారు. ఈమేరకు భోజనశాల నిర్మాణం పూర్తికావడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు దాతను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు శ్రీనాథ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


మద్యం ప్యాకెట్ల ధ్వంసం



మద్యం ప్యాకెట్లను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

మడకశిర: నియోజకవర్గంలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న మద్యం ప్యాకెట్లను గురువారం స్థానిక ఎక్సైజ్ అధికారులు ధ్వంసం చేశారు. మొత్తం 92 కేసుల్లో పట్టుబడిన 364.14 లీటర్ల మద్యాన్ని ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ ప్రసాద్‌రావు తెలిపారు. మద్యం విలువ దాదాపు రూ.1.61 లక్షలు ఉంటుందన్నారు. ఎక్సైజ్ ఎస్ఐ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

కెంచమాంబదేవికి ప్రత్యేక పూజలు



అలంకరణలో అమ్మవారు

అమరాపురం: గొడనకుంట గ్రామంలో వెలసిన కెంచమాంబదేవి అమ్మవారికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పెద్ద జాతరలో పని చేసిన వారిని శాలువాలు, పూల మాలలతో సన్మానించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు



పీడీ రోజాతో రూప, తనుశ్రీ

అమరాపురం: హలుకూరు సమీపంలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు రూప, తనుశ్రీ జాతీయస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. గత వారం ఒడిశాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచడంతో నిర్వాహకులు వారిని జాతీయ పోటీలకు ఎంపిక చేశారన్నారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో గురువారం నుంచి ప్రారంభమైన జాతీయస్థాయి పోటీలో పాల్గొన్నామని పీడీ రోజా తెలిపారు.

సమావేశాల సమయం మార్పు సరికాదు

మడకశిరరూరల్: మండలంలో పాఠశాలల సముదాయ సమావేశ సమయాల్లో మార్పు సరికాదని గతంలోలాగే నిర్వహించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్టీఏ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారుతి ప్రసాద్, జయకృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పాఠశాల సముదాయ సమావేశాలకు హాజరయ్యే ఉపాధ్యాయులు ఉదయం 11.45 గంటల వరకు పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. మధ్యాహ్న భోజనం వడ్డించి, 1 గంటకు దూర ప్రాంతంలో ఉన్న క్లస్టర్ పాఠశాల ఉపాధ్యాయులు సమావేశానికి హాజరు కావడానికి కష్టంగా ఉంటుందని పేర్కొన్నారు. ఆరోజు మెడికల్ లీవ్ తప్ప మిగతా సెలవులు వినియోగించరాదనే నిబంధనలు విధించడం సబబుకాదని పేర్కొన్నారు. పాత నిబంధనలు ప్రకారం 50 శాతం ఉపాధ్యాయులు పాఠశాల సముదాయాలకు హాజరైతే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. గతంలో లాగే సబ్జెక్టు ఉపాధ్యాయులకు మండల స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తే ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. క్లస్టర్ సమావేశాలు ఉన్న రోజుల్లో పాఠశాలలకు పూర్తి స్థాయిలో సెలవులు ప్రకటించాలని కోరారు.

మంగళవాడ అధ్యక్షుడిగా దయానంద



నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకా లోని మంగళవాడ గ్రామ పంచాయతీ అధ్యక్షుడిగా మద్దె గ్రామం సభ్యుడు దయానంద ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్ష స్థానానికి దయానంద ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో అతను ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ఎన్నికల అధికారి తహసీల్దార్ వరదరాజు ప్రకటించారు. ఇదిలా ఉండగా ఈ గ్రామ పంచాయతీలో మొత్తం 17 మంది సభ్యులుండగా వీరిలో 12 మంది కాంగ్రెస్, ఐదుగురు జేడీఎస్ కు చెందిన వారు ఉన్నారు. నూతన అధ్యక్షుడు దయానందను గ్రామ పంచాయతీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు.

19న మున్సిపల్ ప్రత్యేక కౌన్సిల్ మీట్

మడకశిర: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ అధ్యక్షతన ఈనెల 19న ప్రత్యేక కౌన్సిల్ మీట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు కమిషనర్ రంగస్వామి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈసందర్భంగా మున్సిపాలిటీ బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నట్లు తెలిపారు. కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు తప్పక పాల్గొనాలని కోరారు.

శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకుడు

పావగడ: స్థానిక శనీశ్వరాలయంలో జాతరలో భాగంగా గురువారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో సూర్యారాధన, ఆవాహిత దేవతా పూజలు, ఏకాదశ వార రుద్రాభిషేకం, సహస్ర నామార్చన, నవగ్రహ హోమం, లలిత సహస్ర నామ హోమం, పూర్ణాహుతి చేపట్టారు. సాయంత్రం జ్యేష్టాదేవి, శనైశ్చర స్వామికి విశేష ఉత్సవం నిర్వహించారు.

శుభకార్యం

గోరంట్ల (సోమందేపల్లి): గోరంట్లలోని వాసవీ మహల్‌లో గురువారం బాచన్నపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నరసింహప్ప కుమారుడు నవీన్ వివాహం జరిగింది. వివాహ వేడుకల్లో మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ భర్త చరణ్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వీర నారాయణ రెడ్డి తదితరుల పాల్గొన్నారు.

రైతు విశిష్ట నంబర్ ఉంటేనే సంక్షేమ పథకాలు

మడకశిరరూరల్: రైతు విశిష్ట నంబర్ ఉంటేనే రైతులకు సంక్షేమ పథకాలు వర్తిస్తాయని ఏఓ తిమ్మప్ప తెలిపారు. గురువారం స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతు వివరాల నమోదుపై అవగాహన కల్పించారు. రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డుతో పాటు లింక్ అయిన ఫోన్‌ను రైతు సేవా కేంద్రాలకు తీసుకెళ్లి నమోదు చేయించుకోవాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం

సబ్సిడీ రుణాల దరఖాస్తు గడువు పొడిగింపు

మడకశిర: రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రుణాల దరఖాస్తు గడువును ఈనెల 15 వరకు పొడిగించినట్లు మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, ఎంపీడీఓ సోనిబాయి గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. బీసీ, ఈబీసీ, కాపు లబ్ధిదారులు శనివారం వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

అగళి: సువర్ణముఖి వంక నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సుబ్బరావు గురువారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఇసుక అవసరమైన వారు వారి పరిధిలోని సచివాలయంలో తగిన రుసుం చెల్లించాలని సూచించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం పలు పాఠశాలల విద్యార్థులకు జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాసరచన, సంగీతం, వక్తృత్వం, క్విజ్, పాటలు, చిత్రలేఖనం, చదవడం, రాయడం పోటీలు నిర్వహించారు. ఇతర విభాగాల్లో నిర్దేశించిన తేదీల్లో పోటీలు జరుగుతాయని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రశేఖర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

54 మందికి ఉద్యోగాలు

గోరంట్ల (సోమందేపల్లి): జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం గోరంట్లలోని ఏఎస్‌కె డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు. 137 మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరిలో 54 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో సీడాప్ జిల్లా అధికారి దీపక్ రెడ్డి, ప్రిన్సిపాల్స్ లక్ష్మీనారాయణ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

పెనుకొండ రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరేష్ కృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొనాలని సూచించారు.

కంప చెట్లు తొలగింపు

అమరాపురం: హేమావతి గ్రామానికి వచ్చే రహదారులకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను ఆర్అండ్‌బీ అధికారులు గురువారం తొలగించారు. మహాశివరాత్రి, సిద్ధేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో రోడ్డుకిరువైపులా ఉన్న చెట్లను తొలగించినట్లు అధికారులు తెలిపారు.

గోకులం షెడ్లను పూర్తి చేయించండి

రొళ్ల: గోకులం షెడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించాలని ఇన్‌చార్జ్ ఏపీడీ లక్ష్మీనారాయణ సిబ్బందికి సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఏపీడీ మాట్లాడుతూ రొళ్ల మండలానికి 44 గోకులం షెడ్లు మంజూరయ్యాయన్నారు. ప్రతి కూలీకి వంద రోజుల ఉపాధి కల్పించాలన్నారు. ఏపీఓ ఓబుళప్ప, జేఈ మారేగౌడు, సిబ్బంది పాల్గొన్నారు.

మానవసేవే మాధవసేవ

హిందూపురం అర్బన్: హిందూపురం వారిది చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం సాయి సదన్‌లో 30 మంది పిల్లలకు రూ.25,000 విలువ చేసే దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నిమ్మకాయల రాము, శ్రీకాంత్, మంజునాథ్, పవన్, లోకేష్, బాలాజీ, మధు, సాయి సదన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

దొంగల అరెస్ట్

పావగడ: తిరుమణి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉప్పారహళ్లి తండాలో ఉన్న కాళికాదేవి దేవాలయంలోని స్వామివార్ల బంగారు, వెండి ఆభరణాలు, హుండీ కానుకలను ఎత్తుకెళ్లిన దొంగలను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. దొంగలు బొమ్మలాట నరసింహ,కనగానపల్లి మండలం బద్దలాపురం గ్రామానికి చెందిన మణికంఠను అరెస్ట్ చేసి రూ.4 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. చోరీల్లో పాల్గొన్న మరో ఇద్దరు దొంగలు కృష్ణ, అంజి పరారీలో ఉన్నారని తిరుమణి, వైఎన్ హొసకోట పోలీసు అధికారులు తెలిపారు.